క్లుప్తంగా

మండల సర్వసభ్య సమావేశం రేపు

బొబ్బిలి రూరల్: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 24వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పి.రవికుమార్ ఓ ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. ఎంపీపీ శంబంగి లక్ష్మి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులంతా హాజరుకావాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్


పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

రేగిడి: మండలంలో నాగావళి నదీ తీరం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఎస్ఐ పి.నీలావతి పట్టుకుని సీజ్ చేశారు. తాటిపాడు జంక్షన్ వద్ద ఆదివారం పట్టుకుని, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం కేసు నమోదు చేసి, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఇసుక అక్రమ రవాణా జరగకుండా నిఘా ఉంచామని ఎస్ఐ తెలిపారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత


భగవద్గీత గొప్పతనం వివరిస్తున్న ఆధ్యాత్మిక వక్త ఎన్వీ రమణ

రేగిడి: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత అని పాలకొండకు చెందిన ఆధ్యాత్మిక వక్త ఎన్వీ రమణ అన్నారు. మండలంలోని దేవుదల గీతా మందిరంలో గొర్లె దామోదరరావు ఆధ్వర్యంలో దివ్య జీవన సత్సంగ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భగవద్గీత పఠనం మోక్ష ప్రదాయమని, భగవద్గీత చదివితే చెడు గీతలు చెరిగిపోతాయన్నారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కొంత సమయం కేటాయించాలన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో దామోదరరావు, మోహన్‌దాస్, అప్పలరాం, నిత్యస్మరణానందస్వామి, ఎం.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


సభ్యుల విధి విధానాలు వివరిస్తున్న రాష్ట్ర కార్యదర్శి సాయిప్రసాద్

రాజాం సిటీ: స్థానిక ఆదర్శనగర్ యూపీహెచ్‌సీలో గ్రామ, వార్డు ఆరోగ్య కార్యదర్శుల రాజాం డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి డి.సాయిప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ ఎన్నికలో గౌరవాధ్యక్షుడిగా జె.సింహాచలం, అధ్యక్షులుగా అరుణకుమారి, ప్రధాన కార్యదర్శిగా పి.మల్లీశ్వరి, కోశాధికారిగా ఎం.మన్మథలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొత్త కమిటీ సభ్యులకు విధి విధానాలు వివరించారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సభ్యులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల గ్రామ, వార్డు ఆరోగ్య కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

రాజాం: బ్యాంకర్ల ఒత్తిడి లేకుండా చూడాలని స్థానిక పట్టణంలోని టిడ్కో ఇళ్ల లబ్ధిదారులంతా కలిసి ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్‌కు ఆదివారం వినతిపత్రం అందజేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ముందు టీడీపీ హయాంలో తమకు టిడ్కో ఇళ్లు కేటాయించారని, బ్యాంకు రుణాలు కూడా మంజూరు చేశారన్నారు. ఇప్పుడు ఆ ఇళ్లు తమకు ఇవ్వకముందే బ్యాంకర్లు రుణాలు కట్టాలని పట్టుబడుతున్నారని వాపోయారు.

అన్నదానం

రాజాం సిటీ: పట్టణంలోని మల్లిఖార్జున, ఈశ్వరనారాయణ కాలనీలతో పాటు పొనుగుటివలస గ్రామంలో అన్నదాన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. వినాయక చవితి ఉత్సవాలు పురస్కరించుకుని, ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అన్నదానానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరై, స్వామి వారి అన్నప్రసాదం స్వీకరించారు.

నేడు వైద్య శిబిరం

బొబ్బిలి: పట్టణంలోని సీహెచ్‌సీలో సోమవారం వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారి జి.శశిభూషణరావు ఆదివారం తెలిపారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భా గంగా ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా వారాల పండగ

బొబ్బిలి రూరల్: మండలంలోని కోమటిపల్లి గ్రామంతో పాటు, దిబ్బగుడ్డివలస పంచాయతీ పరిధిలోని రాచేరువలస గ్రామంలో వారాల పండగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏటా వరిపంట పొట్ట దశకు వచ్చే సమయంలో ఈ సంబరాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఎండుగడ్డితో చేసిన దిష్టిబొమ్మలను గ్రామ పొలిమేరల్లో ఊరేగిస్తూ బలిచ్చిన మేకలు, కోళ్ల రక్తం, అన్నం, బియ్యం కలిపి పేరంటాలుకు నైవేద్యంగా సమర్పించారు.

• పరుచుకున్న పచ్చదనం


ఈ చిత్రంలోని పంటపొలాలు.. సంతకవిటి మండలంలోని సిరిపురం చెరువు ఆయకట్టు పరిధిలోనివి. ఇటీవల కురిసిన వర్షాలకు తగినంత నీరు అందడంతో వరి పంట ఏపుగా పెరిగి, పచ్చదనం నిండుకుంది. పొందూరు–సంతకవిటి ప్రధాన రోడ్డుకు ఇరువైపులా పచ్చదనం పరుచుకున్నట్లు ఇక్కడి పొలాలు అందాన్ని, ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. చూపరుల మదిని దోచేస్తున్నాయి. –సంతకవిటి

• పండగ ప్రారంభం

రాజాం గ్రామదేవతల పండగ ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. కుమ్మరివీధిలోని అమ్మవారి ఆలయం నుంచి ఘటంతో తిరువీధి నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని, అమ్మవారికి ముర్రాటలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సంబరాలు నెలరోజుల పాటు కొనసాగుతాయని, ప్రతీ ఆది, మంగళవారాల్లో అనుపోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. –రాజాం



• జలకళ


ఇటీవల కురిసిన వర్షాలతో నదులు, చెరువులు, సాగునీటి కాలువలు జలకళను సంతరించుకున్నాయి. సంతకవిటి మండలంలోని రంగారాయపురం వద్ద ఉన్న నారాయణపురం ఆనకట్టలోకి వరదనీరు భారీగా వచ్చి, చేరడంతో కుడి ప్రధాన కాలువ ద్వారా సాగునీరు దిగువ ప్రాంతాలకు ఇలా ప్రవహిస్తోంది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. –సంతకవిటి

పలుపత్ర ద్రావణం..
పంటలకు బహుబాగు

రాజాం: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా తయారు చేసే పలుపత్ర ద్రావణం.. పంటలు బాగా పండేందుకు ఉపయోగపడుతుందని ప్రకృతి వ్యవసాయం ప్రతినిధులు రమాదేవి, అరుణ తెలిపారు. మండలంలోని కొఠారిపురం గ్రామంలో పలుపత్ర ద్రావణం తయారీపై ఆదివారం అవగాహన కల్పించారు. వేప, జిల్లేడు, కానుగ, సీతాఫలం, కుంకుడు, మందార, కలబంద, తులసని, చింతాకు, మునగ, బొప్పాయి, నేపియర్‌గడ్డి, అత్తాకోడల ఆకు, వెదురు, జామ, గోంగూర, ఉమ్మెత్తు, గన్నేరు వంటి 18 రకాల ఆకులను రెండు కిలోల చొప్పున సేకరించి, వాటిని 200 లీటర్ల నీటిలో వేసి వారం పదిరోజుల తర్వాత వడగట్టి ఎకరాకు 10 లీటర్ల ద్రావణాన్ని వంద లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఎటువంటి పెట్టుబడి లేకుండా తయారు చేసుకున్న పలుపత్ర ద్రావణం ద్వారా వరిపంటకు సోకే పురుగులు, తెగుళ్లను నివారించవచ్చన్నారు.


రాజాం: పలుపత్ర ద్రావణం తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది


తూటికాడ కషాయం తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

తూటికాడ కషాయం తయారీ

బొబ్బిలి రూరల్: మండలంలోని కృష్ణాపురం గ్రామంలో తూటికాడ కషాయం తయారీపై ఆదివారం అవగాహన కల్పించారు. ఎకరా విస్తీర్ణంలోని పంటపొలానికి 10 లీటర్ల తూటికాడ కషాయం పిచికారీ చేయడం ద్వారా పంటను సుడిదోమ తెగులు నుంచి కాపాడవచ్చని ప్రకృతి వ్యవసాయ నిపుణుడు శంకరరావు తెలిపారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా తయారయ్యే వివిధ కషాయాల ద్వారా పంటలకు మేలు అని, ఆరోగ్యవంతమైన పంటతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు.

సాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తా

రామభద్రపురం: మండలంలోని కొట్టక్కి గ్రామంలో ఎమ్మెల్యే బేబీనాయన ఆదివారం పర్యటించారు. అక్కడి రైతులను కలిసిన ఆయన.. సాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. పెద్దగెడ్డ సాగునీటి కాలువ నుంచి సాగునీరు తెప్పించే చర్యలు చేపడతామన్నారు. అలాగే అదనంగా మంచినీటి ట్యాంకు మంజూరు చేసి, తాగునీటి ఇక్కట్లు లేకుండా చూస్తానన్నారు. ప్రజాసేవే తన లక్ష్యమని, పదవి లేనప్పుడే ప్రజలకు అండగా ఉన్నానని, ఇప్పుడు పదవిలో ఉన్నానని మరిన్ని సేవలు చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. దీపావళికి ఉచిత గ్యాస్ సిలిండర్‌ల పథకం అమలవుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, నాయకులు తెంటు లక్ష్మంనాయుడు, ముల్లు రాంబాబు, మడక తిరుపతిరావు, చింతల రామకృష్ణ, వసంతుల తిరుపతిరావు, బవిరెడ్డి చంద్ర, ఎంపీడీవో రమామణి, తహసీల్దారు సులోచనరాణి తదితరులు పాల్గొన్నారు.


కొట్టక్కి గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

పుస్తక పఠనంతో అపార జ్ఞానం

తెర్లాం: పుస్తక పఠనం ద్వారా అపారమైన జ్ఞానం లభిస్తుందని, ప్రతిఒక్కరూ ప్రాథమిక స్థాయి నుంచే పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని విశ్రాంత ఎంఈవో ఎం.సత్యనారాయణ తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం ఆదివారం నిర్వహించారు. పుస్తకాలు ఎలా చదవాలి, అందులోని విషయాన్ని ఏ విధంగా గ్రహించాలన్న అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులతో పాటు మిగతా వారు కూడా ఖాళీ సమయాల్లో తమకు నచ్చిన పుస్తకాన్ని చదవాలని తెలిపారు. విద్యార్థులంతా ప్రాథమిక స్థాయి నుంచే పుస్తక పఠనం, చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో కూడా తర్ఫీదు పొందాలన్నారు. ప్రతీ విద్యార్థి గ్రంథాలయంలో చిల్డ్రన్స్ క్లబ్‌లో చేరాలని లైబ్రేరియన్ కృష్ణమూర్తి తెలిపారు. గ్రంథాలయంలోని అన్ని రకాల పుస్తకాలను పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నెమలాం హైస్కూల్ క్రాఫ్ట్ ఉపాధ్యాయుడు విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు పుస్తకాలు చదవడాన్ని నేర్పిస్తున్న విశ్రాంత ఎంఈవో సత్యనారాయణ

ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచేందుకే 'జమిలి'

- సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

బొబ్బిలి: ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచేందుకే కేంద్ర ప్రభుత్వం జమిలి ఎన్నికలను తెరపైకి తీసుకువచ్చిందని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ విమర్శించారు. స్థానిక పట్టణంలో ఆదివారం నిర్వహించిన సీపీఎం విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ నియంతృత్వ పాలన కోసమే ఒకే దేశం-ఒకే ఎన్నిక విధానాన్ని తీసుకువస్తోందని దుయ్యబట్టారు. అలాగే జమిలి ఎన్నికలకు సీపీఎం వ్యతిరేకం కాదన్నారు. ప్రజలపై భారం వేసి, కార్పొరేట్ సంస్థలకు రాయితీలు ఇవ్వడమే బీజేపీ విధానమన్నారు. కార్పొరేట్‌లకు కొమ్ముకాస్తూ వారికి చెందిన వందల కోట్లు, వేల కోట్లు రుణాలు మాఫీ చేస్తున్నారన్నారు. రైతు పోరాటాలతోనే ఉత్తరాది రాష్ట్రాల్లో బీజేపీకి ఘోరపరాభవం ఎదురైందన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై స్పందించిన జనసేన, టీడీపీలు.. ఇప్పుడు వారే అధికారంలో ఉన్నా నోరు విప్పకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. మూతపడిన జూట్, చక్కెర పరిశ్రమలను తెరిపించి, నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలన్నారు. అనంతరం ఏచూరి సీతారాం ఆశయ సాధనకు కృషి చేసేందుకు తీర్మానం చేశారు. సమావేశంలో బొబ్బిలి పట్టణ, మండల సీపీఎం కార్యదర్శులు పొట్నూరు శంకరరావు, ఎస్.గోపాల్, రామభద్రపురం, బాడంగి మండల కార్యదర్శులు బి.శ్రీనివాసరావు, ఎ.సురేష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

నిషేధిత పాలిథిన్ వినియోగించరాదు

రేగిడి: నిషేధిత పాలిథిన్, ప్లాస్టిక్ సంచులు వినియోగించరాదని స్వచ్ఛదూత్ మండల కో–ఆర్డినేటర్ కడగల పద్మ సూచించారు. ఆదివారం మండలంలోని తాటిపాడు గ్రామంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించి, పాలిథిన్ నిషేధంపై అవగాహన కల్పించడంతో పాటు తాగునీరు, విద్యుత్ ఆదాపై పలు సూచనలు చేశారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నుంచి ఎరువు తయారు చేసి, రైతులకు రాయితీపై ఇచ్చి పంచాయతీకి అదనపు ఆదాయం వచ్చేలా చూడాలన్నారు. పంచాయతీ కార్యదర్శి ఎం.చిన్నారావు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛదూత్ మండల కో–ఆర్డినేటర్ పద్మ

తుప్పలు తొలగించరూ..

తెర్లాం: మండలంలోని పలు గ్రామాల్లోని రోడ్లకు ఇరువైపులా దట్టంగా పెరిగిన తుప్పలు, డొంకలను తొలగించాలని వాహన చోదకులు, ప్రయాణీకులు కోరుతున్నారు. తెర్లాం నుంచి బొబ్బిలి, పణుకువలస నుంచి వంతరాం, పెరుమాళి నుంచి సుందరాడ, ఉద్దవోలు నుంచి గలావల్లి, పినపెంకి నుంచి కుసుమూరు, నందిగాం నుంచి కుసుమూరు వెళ్లే రోడ్లకు ఇరువైపులా దారి కనిపించనంతగా తుప్పలు, డొంకలు పెరిగిపోయాయి. దీంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించడం లేదని, భారీ వాహనాలు వచ్చినప్పుడు వాహనాలను కిందకు దించలేని పరిస్థితి తలెత్తుతోందని వాహన చోదకులు చెబుతున్నారు. ఎటువంటి ప్రమాదాలు జరగకముందే సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి, రోడ్లకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని కోరుతున్నారు.


ఉద్దవోలు వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


తమ గురువులతో పూర్వ విద్యార్థులు

బాడంగి: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. దాదాపు 20 ఏళ్ల తర్వాత కలుసుకున్న 2004–2006 బ్యాచ్ ఇంటర్మీడియట్ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, ఆనాటి తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని సరదాగా గడిపారు. అనంతరం అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. అలాగే ఓ చాప్ కట్టర్(గడ్డికోత యంత్రం)ను కళాశాలకు బహూకరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామదాసు, మాజీ ప్రిన్సిపాల్ శ్రీరామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

నేత్ర శస్త్రచికిత్సకు 35 మంది ఎంపిక

తెర్లాం: స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి హాజరైన వారిలో 35 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆప్తాలమిక్ అధికారి సురేష్ తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వచ్చిన 80 మంది కంటి రోగుల కళ్లను శంకర్ ఫౌండేషన్ వైద్యులు పరీక్షించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. నేత్ర శస్త్రచికిత్సకు ఎంపికైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ క్యాంప్ కో–ఆర్డినేటర్ ఎం.సాయికుమార్, తెర్లాం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కందుల శ్రీనివాసరావు, కార్యదర్శి వరదా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మరో 14 మంది..

బాడంగి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విజయనగరానికి చెందిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి యాజమాన్యం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరానికి హాజరైన వారిలో అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే మరో 14 మందిని వివిధ శస్త్రచికిత్సలకు ఎంపిక చేసి, ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో ఆస్పత్రి యజమాని శ్రీరామ్మూర్తి, ఎండీ అనిల్ కుమార్, వైద్యుడు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బొద్దాంలో 16 మంది..

రాజాం: మండలంలోని బొద్దాం గ్రామంలో పాత సచివాలయం వద్ద ఉచిత నేత్రవైద్య శిబిరం ఆదివారం ఏర్పాటు చేశారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, విజయనగరం వేంకటేశ్వర పుష్పగిరి కంటి ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో శిబిరానికి హాజరైన వారికి కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. వివిధ కంటి సమస్యలతో బాధపడుతూ శస్త్ర చికిత్స అవసరమైన 16 మందిని ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. అనంతరం వారిని ప్రత్యేక వాహనంలో ఆపరేషన్లకు తరలించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నక్క వర్షిణి, సర్పంచ్ నక్క శ్రీనివాసరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు నక్క సత్యారావు, పీఏసీఎస్ డైరెక్టర్ నక్క ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.


తెర్లాం: వృద్ధుడి కళ్లను తనిఖీ చేస్తున్న ఆప్తాలమిక్ అధికారి సురేష్


బాడంగి: వైద్య శిబిరంలో రోగులకు సేవలందిస్తున్న వైద్యుడు సతీష్


రాజాం: నేత్ర వైద్య తనిఖీలు చేస్తున్న సిబ్బంది

చురుగ్గా పారిశుధ్య పనులు

రేగిడి: మండలంలోని వన్నలి, అంబకండి, ఉనుకూరు, చిన్నశిర్లాం, బూరాడ తదితర గ్రామాల్లో పారిశుధ్య పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. ప్రధాన రోడ్లు, వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించడంతో పాటు కాలువల్లోని పూడికలు తొలగించారు.

ఘనంగా నిమజ్జనోత్సవం

సంతకవిటి: మండలంలోని వాసుదేవపట్నం గ్రామంలో గణనాథుని నిమజ్జనోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం వేదపండితులు శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం లడ్డూ ప్రసాదం వేలంపాట నిర్వహించిన అనంతరం గణేశుడి విగ్రహ ఊరేగింపు ఆ తర్వాత నిమజ్జనం చేశారు.

పరిసరాల పరిశుభ్రతలో భాగం కావాలి

రాజాం సిటీ: ప్రజలు తమ దైనందిన జీవితంలో పరిసరాల పరిశుభ్రతను ఒక భాగం చేసుకోవాలని జీఎంఆర్ ఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక పట్టణ పరిధిలోని డోలపేట శివాలయ ప్రాంగణంలో కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అక్టోబరు 1వ తేదీ వరకు చేపట్టనున్న స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా కళాశాల నుంచి వివిధ ప్రాంతాల్లో విద్యార్థులు నిర్వహిస్తున్న పరిశుభ్రతా కార్యక్రమాలకు ప్రజల సహకారం బాగుందన్నారు. ప్రతిఒక్కరూ తమ పరిసరాలను శుభ్రం చేసుకుంటే వ్యాధుల నుంచి దూరంగా ఉండొచ్చన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్‌లు డాక్టర్ వి.రాంబాబు, డాక్టర్ ఎంవీ నాగేశ్వరరావు, డాక్టర్ అట్టాడ వెంకటరమణ, ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ కేవీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


ఆలయ ప్రాంగణం పరిశుభ్రం చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

విజయవాడ వెళ్లి, బాధితులకు సాయం

బొబ్బిలి: విజయవాడలోని సింగ్‌నగర్, రాజరాజేశ్వరిపేట, తదితర ప్రాంతాల్లోని వరద బాధితులకు స్థానిక పట్టణానికి చెందిన అభ్యుదయ ఫౌండేషన్ అధ్యక్షురాలు డాక్టర్ చింత శారద, గజపతినగరం సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాయికుమార్, సాయిరేవంత్, అమ్మసేవ ఫౌండేషన్ ప్రతినిధులు సురేష్, సాయిలు అండగా నిలిచారు. నిత్యవసర సరుకులు, దుస్తులు, పుస్తకాలను ఆదివారం అందజేశారు. నిత్యావసరాలు, దుస్తులు, పుస్తకాలను ఆదివారం అందజేశారు.

ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు

బొబ్బిలి: పట్టణంలోని శ్రీకళాభారతి మున్సిపల్ ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన ఆనందో్బ్రహ్మ కళాప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్ అధ్యక్షుడు మింది విజయమోహనరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కళాప్రదర్శనలను ఎమ్మెల్యే బేబీనాయన జ్యోతి ప్రజ్వలన చేసి, ప్రారంభించారు. కళాకారులు, చిన్నారులు చేసిన ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో కళాభారతి కార్యదర్శి నంబియార్ వేణుగోపాలరావు, కర్రి సత్యనారాయణ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.